క్లుప్తంగా

అర్హులు పేర్లు నమోదు చేసుకోవాలి

గోస్పాడు: అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులై ఉండి జాబితాలో పేర్లు లేని వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి స్వప్నికా రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశం ఆమె మాట్లాడుతూ మండల పరిధిలోని గ్రామాల రైతు సేవా కేంద్రాలలో అన్నదాత సుఖీభవ అర్హుల జాబితాను ప్రదర్శించినట్లు తెలిపారు. ఈ పథకానికి అర్హులై ఉండి పేర్లు రాని వాళ్లు సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ సిబ్బంది ద్వారా నమోదు చేసుకోవాలని తెలిపారు. జాబితాలో పేర్ల నమోదుకు నేడు చివరి రోజు అని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఏపీపీకి సన్మానం



మాట్లాడుతున్న ఆకుమల్ల రహీం

నంద్యాల(అర్బన్): ఏపీపీగా నియమితుడైన రాజేష్‌రెడ్డిని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా కార్యాలయంలో సోమవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుమల్ల రహీం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు క్రిస్టియన్ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నెం జానయ్య, జిల్లా అధ్యక్షురాలు ప్రసన్నకుమారి, కార్యదర్శి సత్యనారాయణ, రహంతుల్లా, మోహన్‌బాబు, పాస్టర్ జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆకుమల్ల రహీం మాట్లాడుతూ న్యాయవాద వృత్తిలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, ప్రభుత్వం ఏపీపీగా బాధ్యతలు అప్పగించిన రాజేష్‌రెడ్డి పేద ప్రజల పక్షాన నిలిచి పోరాడాలన్నారు.

ఆర్వో ప్లాంట్‌కు భూమి పూజ



ఆర్వోప్లాంట్‌కు భూమి పూజ చేస్తున్న దృశ్యం

గోస్పాడు: నంద్యాల పట్టణంలోని మెడికల్ కళాశాలలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు జిల్లా కలెక్టర్ రాజకుమారి రైల్వే సీఎస్‌ఆర్ నిధులు కేటాయించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ తెలిపారు. సోమవారం ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు భూమి పూజ నిర్వహించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 1000 లీటర్ల సామర్థ్యం గల ఆర్వో ప్లాంట్ మంజూరుతో తాగునీటి సమస్య తలెత్తదన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ మనోహర్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కళావతి, ఏఓ రమ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థి ఎంపిక



విద్యార్థినిని సన్మానిస్తున్న టీచర్లు

శిరివెళ్ల: రాజనగరం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి నిచ్చెన మెట్ల సాయి ఈశ్వర్ ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యాడు. ఈ మేరకు సోమవారం విద్యార్థిని టీచర్లు అభినందించారు. హెచ్‌ఎం తిరుపతి రెడ్డి మాట్లాడుతు విద్యార్థి 10వ తరగతి పరీక్షల్లో 569 మార్కులు సాధించారన్నారు. దీంతోనూజీ వీడు ట్రిపుల్ ఐటీలో సీట్ వచ్చిందన్నారు. ఈ అభినందన కార్యక్రమంలో తండ్రి ఆంజనేయులు, టీచర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ధర్మ రక్షాదళ్ జిల్లా గౌరవ అధ్యక్షుడిగా రామకృష్ణారెడ్డి

నంద్యాల(వ్యవసాయం): రాష్ట్రీయ ధర్మ రక్షాదళ్ జిల్లా గౌరవ అధ్యక్షుడిగా తాడి రామకృష్ణారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం స్థానిక నంద్యాల ఎన్‌జీఓ కాలనీ, లలితానగర్‌లలో జిల్లా రాష్ట్రీయ ధర్మ రక్షాదళ్ జిల్లా కార్యవర్గం సమావేశం నిర్వహించారు. ఇందులో జిల్లా గౌరవ అధ్యక్షులుగా గోస్పాడు మండలానికి చెందిన తాడి రామకృష్ణారెడ్డి, గౌరవ సలహా దారులుగా మండ్ల గంగాధర్, రాష్ట్రీయ ధర్మ రక్షాదళ్ జిల్లా కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. వీరు రాష్ట్రీయ ధర్మ రక్షాదళ్ జిల్లా అధ్యక్షులు ఎన్‌పీ నవీన్ గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామ సర్వేయర్లకు వీడ్కోలు



సర్వేయర్లను సత్కరిస్తున్న తహసీల్దార్

దొర్నిపాడు: మండలంలోని గ్రామ సచివాలయాల్లో పని చేస్తున్న గ్రామ సర్వేయర్లు గంగాధర్, కార్తీక్, వందన, వీఆర్‌ఓ ప్రవీణ్‌లకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సుభద్ర ఘనంగా సత్కరించారు. అనంతరం భూ రీసర్వేలో భాగంగా వీరు చేసిన సేవలను ఆమె గుర్తించి అభినందించారు. కార్యక్రమంలో డీటీ మాధవ, వీఆర్‌ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు తోడ్పాటునందించాలి

- తల్లికి వందనం అర్హుల వెరిఫికేషన్ త్వరగా పూర్తి చేయాలి
- వ్యాధుల నివారణ చర్యలపై దృష్టి పెట్టాలి
- అధికారులతో జిల్లా కలెక్టర్ రాజకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల: ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు సంపన్న వర్గాల ద్వారా తోడ్పాటునందించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీ4 (పబ్లిక్–ప్రైవేటు–పీపుల్స్–పార్టనర్ షిప్) సంబంధించి జిల్లా అధికారులు మార్గదర్శులుగా నమోదు కావాలన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాల్‌లో పీ4 మార్గదర్శి–బంగారు కుటుంబం, తల్లికి వందనం, కుక్క కాటు, డెంగీ, డయేరియా, నీటి కాలుష్యం నివారణ, చుక్కల భూములు, పీజీఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారం తదితర అంశాలపై అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో అట్టడుగున ఉన్న వారిని అభివృద్ధిలోకి తీసుకురావడానికి పీ 4 పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. బంగారు కుటుంబాలకు చేయూత అందజేయడం మార్గదర్శకుల బాధ్యత అన్నారు. జిల్లా, డివిజన్ మండల స్థాయి అధికారులు మార్గదర్శక ఎన్‌రోల్ చేసుకుని బంగారు కుటుంబాలకు అవసరమైన సహాయం అందజేయాలని సూచించారు. అలాగే ప్రభుత్వం ప్రవేశపెట్టిన తల్లికి వందనం పథకంలో అర్హులై ఉండి లబ్ధి అందని 3,416 మంది పిల్లల వెరిఫికేషన్ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కుక్కల దాడిలో చిన్న పిల్లలు మృతి చెందకుండా మున్సిపల్ పంచాయతీలలో పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. డెంగీ, డయేరియా, నీటి కాలుష్యం నివారణకు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. చుక్కల భూముల పరిష్కారాన్ని సబ్ డివిజన్ల వారీగా త్వరగా పూర్తిచేయాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా పాఠశాల వసతి గృహాలు పాడుబడి ఉంటే అటువంటి వాటిని పరిశీలించి వెంటనే నివేదిక అందజేయాలన్నారు. సూర్య ఘర్, కమ్యూనిటీ సోక్ పిట్స్, పారిశుద్ధ్యం, తాగునీరు, ఉపాధి హామీ పథకాలపై కూడా పలు సూచనలు జారీ చేశారు. పీజీఆర్‌ఎస్ దరఖాస్తులను బాధ్యతాయుతంగా పరిష్కరించాలన్నారు. వివిధ శాఖలకు సంబంధించి వార్త పత్రికల్లో వచ్చే ప్రతికూల అంశాలపై జిల్లా అధికారులు సంబంధిత మండల అధికారుల నుంచి సరైన వివరణ తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ రాము నాయక్, ఆర్డీఓలు, ఎస్‌డీసీలు, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, డివిజన్ మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

21న నంద్యాలలో మెగా జాబ్ మేళా

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఆత్మకూరు బస్టాండ్ సమీపంలో ఉన్న ఎన్‌టీఆర్ షాదీఖానాలో ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. సోమవారం జాబ్‌మేళాకు సంబంధించిన వాల్‌పోస్టర్లను కలెక్టర్‌తో పాటు డీఆర్‌ఓ రామునాయక్, మున్సిపల్ కమిషనర్ శేషన్న, ఎస్‌డీసీ రాంభూపాల్‌రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీధర్‌రెడ్డి, ఎంప్లాయ్ మెంట్ అధికారి సాంబశివారెడ్డి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ జాబ్‌మేళాకు 11 ప్రైవేటు కంపెనీలు హాజరవుతున్నాయని చెప్పారు. ఐటీఐ, పది, డిప్లొమో, ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఎం.ఫార్మసీ, పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. మరింత సమాచారం కోసం సెల్: 9182217075, 9951400588 నంబర్లను సంప్రదించాలన్నారు.

స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు ప్రారంభం

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని పీఎస్సీ కేవీఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 16వ తేదీ నుంచి మైండ్ స్పార్క్ స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 15రోజులు శిక్షణ ఉంటుందన్నారు. ఇంటర్ పాస్ అయిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనాలిటికల్ స్కిల్, బేసిక్ కంప్యూటర్‌స్కిల్‌పై శిక్షణలు ఉంటాయన్నారు. మరింత సమాచారం కోసం మాదన్న సెల్ : 9618717566 నెంబరును సంప్రదించాలన్నారు.

గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిస్టరీ విభాగంలో గెస్ట్ లెక్చరర్ల నియామకానికి అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ తెలిపారు. అర్హతలు ఎంఏ హిస్టరీలో కనీసం 55శాతం మార్కులతో ఉత్తీర్ణత ఉండాలన్నారు. పీహెచ్‌డీ లేకుండా ఎన్‌ఈటీ, ఎస్‌ఈటీ, ఎస్‌ఎల్‌ఈటీలో అర్హత కలిగి అభ్యర్థులకు ప్రాధాన్యం ఇవ్వబడుతుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటా, అనుభవ పత్రాలు, ఫొటోలు ఈనెల 18లోగా ప్రిన్సిపాల్‌కు ఇవ్వాలన్నారు.

స్వచ్ఛందంగా రక్తదానం



శిబిరంలో రక్తదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం నియోజకవర్గ పరిధిలోని శిరివెళ్ల, చాగలమర్రి, ఆళ్లగడ్డ, దొర్నిపాడు, ఉయ్యాలవాడ, రుద్రవరం మండలాల్లో ఘనంగా నిర్వహించారు. ఆయా మండలాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమావేశాలు ఏర్పాటు చేసి కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకుని పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

చాగలమర్రి మండలం ముత్యాలపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ యువజన నాయకుడు గుర్రప్ప ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. పట్టణంలోని వైఎస్సార్సీపీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో సుమారు 40 మంది వైఎస్సార్సీపీ యువజన విభాగం శ్రేణులు రక్తదానం చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ నాసారి ప్రసాద్, కేకే, డాక్టర్ సురేంద్ర, రామ్మోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులున్నారు

అతివేగం ప్రమాదకరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ

నంద్యాల: అతివేగం ప్రమాదకరమని, దీనిని దృష్టిలో ఉంచుకొని యువత వాహనాలను పరిమిత వేగంతో నడపాలని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున గుప్త సూచించారు. సోమవారం నేషనల్ డిగ్రీ కాలేజీలో విద్యార్థినీ విద్యార్థులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదన్నారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణం చేయరాదని, డ్రైవర్ పక్కన ఇరుక్కొని కూర్చోవడం వంటివి ప్రమాదమన్నారు. రహదారి ప్రమాదాలు ఎక్కువగా మానవ తప్పిదాల వల్లే జరుగుతున్నాయని, కావున ప్రతి ఒక్కరు వేగంతో ప్రయాణించకుండా సురక్షితంగా గమ్యం చేరుకోవాలన్నారు. హెల్మెట్ ధరించడం అంటే కేవలం మోటారు వాహన చట్టంలోని నిబంధనల కోసమో, పోలీసులు వేసే జరిమానాలు తప్పించుకోవడానికో కాదని, మనపై ఆధారపడిన వారి కోసమనే విషయాన్ని గ్రహించాలన్నారు. రోడ్డు భద్రత నిబంధనలు తప్పక అందరూ పాటించడంతో పాటు ఇతరులకు అవగాహన కల్పించాలన్నారు.

యువతను మోసం చేసిన కూటమి సర్కారు



నిరుద్యోగ భృతి ఇవ్వాలని కోరుతూ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): నిరుద్యోగ భృతి ఇస్తానని యువతను కూటమి ప్రభుత్వం మోసం చేసిందని ఏఐవైఎఫ్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాముడు పేర్కొన్నారు. సోమవారం నంద్యాల కలెక్టరేట్ వద్ద ఆ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా సర్కారు ఎన్నికల హామీలపై నోరుమెదపడం లేదన్నారు. 18 నుంచి 50 సంవత్సరాల మధ్యలో నిరుద్యోగులు, ఉపాధి లేని వారు 1.56 కోట్లు మంది ఉన్నట్లు ప్రభుత్వ గణాంకాలు తెలియజేస్తున్నాయన్నారు. నిరుద్యోగ యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ రంగంలో శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించాలన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వీటిపై స్పందించకపోతే కూటమి ప్రభుత్వానికి భవిష్యత్తులో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డీఆర్‌ఓ రామునాయక్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు పృధ్వీకుమార్, రమేష్, లక్ష్మయ్య, మహేష్, ప్రవీణ్, విష్ణు, రాజు, శివ, శ్రీరాం, చంద్ర, అరుణ్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



యర్రగుంట్లలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

అపూర్వ కలయిక



గోస్పాడులో...

శిరివెళ్ల: యర్రగుంట్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 1994–95 విద్యా సంవత్సరానికి చెందిన విద్యార్థులు మూడు దశాబ్దాల తర్వాత తాము చదివిన పాఠశాలలో కలుసుకుని నాటి తమ జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువులు వేమారెడ్డి, దత్తన్న, సాంబ శివారెడ్డిలకు శాలువలు కప్పి పూల మాలలతో ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయకుమార్, పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు నాగేశ్వరరెడ్డి, మహేశ్వరరెడ్డి, పుల్లయ్య, సుభద్రాదేవి, తదితరులు పాల్గొన్నారు.

గోస్పాడు: 1999–2000 ఏడాదిలో గోస్పాడు హైస్కూల్‌లో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు అప్పటి ఉపాధ్యాయులను ఆహ్వానించి సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గురువులు నందయ్య, మౌలాలి, సుదాకర్, రామ్మోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ 25 సంవత్సరాల క్రితం విద్యను అభ్యసించిన వారు తమను గౌరవించి సత్కరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం గురువులను పూర్వ విద్యార్థులు, శాలువాలు, పూలమాలలతో సన్మానించారు.

పీజీఆర్‌ఎస్‌కు 3 అర్జీలు

చాగలమర్రి: మండల కేంద్రం చాగలమర్రిలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న పీజీఆర్‌ఎస్‌కు రెవెన్యు భూములకు సంబంధించి 3 అర్జీలు వచ్చినట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ విజయ్ కుమార్ తెలిపారు. ఇతర శాఖలకు సంబంధించి ఒక్క దరఖాస్తు కూడా రాక పోవడం గమనార్హం. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం నామ మాత్రంగా నిర్వహిస్తుందని, ఎలాంటి సమస్యలు పరిష్కారం కావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అంతే కాకుండా ఈ కార్యక్రమానికి అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు హాజరు కావడం లేదు.

పీ-4తో పేద కుటుంబాలు బలోపేతం

ఉయ్యాలవాడ : పీ–4 కార్యక్రమం ద్వారా పేద కుటుంబాలు ఆర్థికంగా బలోపేతమవుతాయని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 గ్రామ సచివాలయాల పరిధిలో 21 గ్రామాల్లో పీ–4 సర్వేలో 982 నిరుపేద బంగారు కుటుంబాలు గుర్తించడం జరిగిందన్నారు. ఈ కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు 490 కుటుంబాలను ఎస్‌ఆర్‌ఐలకు కలపడం జరిగిందని, మిగిలిన 492 కుటుంబాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

పంచమఠాలలో పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో లోకకల్యాణార్థం పంచమఠాలలో విశేషంగా అభిషేకం, పుష్పార్చనలు జరిపించారు. సోమవారం ఉదయం భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్ష మఠం, సారంగధరమఠాలలో పూజాదికాలు జరిపించారు. ముందుగా అర్చకులు సంకల్పాన్ని పఠించారు. అనంతరం ఘంటామఠంలోని గణపతికి పూజాదికాలు జరిపారు. అనంతరం అన్ని మఠాలలో సంప్రదాయబద్ధంగా అభిషేకాది అర్చనలను నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు, ఏఈఓ హరిదాసు పాల్గొన్నారు.


మల్లన్నకు సహస్రదీపార్చన సేవ

శ్రీశైలంటెంపుల్: జ్యోతిర్లింగక్షేత్రమైన శ్రీశైలమహాక్షేత్రమైన భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం దేవస్థానం సహస్రదీపార్చన సేవను నిర్వహించింది. ముందుగా ఆలయ ప్రాంగణంలోని పురాతన మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు వేదమంత్రోచ్చరణలతో సహస్రదీపార్చన పూజలు జరిపించారు. సేవలో భాగంగా మండపంలో వెయ్యి దీపాలను వెలిగించి, ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను వెండిరథంపై ఆశీనులను చేసి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు.

ప్రసాదాల తయారీపై పర్యవేక్షణ తప్పనిసరి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలం మల్లన్న ప్రసాదాల తయారీపై నిరంతరం పర్యవేక్షించాలని శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు అధికారులకు సూచించారు. సోమవారం దేవస్థాన పరిపాలన భవనంలోని సమీక్షా సమావేశ మందిరంలో అన్ని శాఖాధిపతులు, విభాగాల పర్యవేక్షకులతో సమీక్షా సమావేశమై పలు సూచనలు చేశారు. సమావేశంలో డిప్యూటీ ఈఓ ఎం.రమణమ్మ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు మురళీబాలకృష్ణ, నరశింహారెడ్డి పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏసురత్నం

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు జీవో నం.36 ప్రకారం వేతనాలు పెంచాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, ఆప్కాస్ కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏసురత్నం, నాగరాజు డిమాండ్ చేశారు. ఈ అంశంపై సోమవారం స్థానిక ఆ యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల పట్ల నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తుందని ఆరోపించారు. తాము కార్మికుల సమ్మెకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బాలవెంకట్ పాల్గొన్నారు.

93 మందికి వంద రోజుల పని



శెట్టివీడు గ్రామ సచివాలయం వద్ద సామాజిక తనిఖీ గ్రామ సభను నిర్వహిస్తున్న సిబ్బంది

చాగలమర్రి: మండలంలోని శెట్టివీడు గ్రామపంచాయతీలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా 93 మందికి 100 రోజుల పాటు పని కల్పించినట్లు సామాజిక తనిఖీ బృందం ఎస్‌ఆర్‌పీ భాస్కర్ తెలిపారు. గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా చేపట్టిన పనులను సామాజిక తనిఖీ బృందం పరిశీలించి సోమవారం సచివాలయం వద్ద కార్యదర్శి ఆదినారాయణ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తనిఖీ నివేదికను డీఆర్‌పీ యువరాజ్ చదివి వినిపించారు. గ్రామంలో 465 మందికి జాబ్ కార్డులు మంజూరు చేయగా, వారిలో 359 మంది కూలీ పనికి వచ్చారన్నారు. అదే విధంగా గ్రామంలో సుమారు 59 పనులు చేపట్టగా, ఆ పనులకు సంబంధించి రూ.53.50 లక్షలు వేతనాలు, రూ.93,272 మెటీరియల్‌కు మంజూరు చేసినట్లు తెలిపారు. గ్రామంలో హార్టికల్చర్‌కు సంబంధించి పంపిణీ చేసిన మొక్కలు పొలంలో లేవని తనిఖీలో తేలిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ నిర్మల, సచివాలయ సిబ్బంది మహమ్మద్ ఇలియాస్, సుధాకర్, మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కూలీలలకు పనులు కల్పించండి

ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించి కొత్తగా ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించినా రెండునెలలుగా ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులు కల్పించలేదని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గ్రామ సభల ద్వారా పనులకు ఆమోదం తెలిపి, వర్క్ ఐడీలు ఉన్నా పనులు కల్పించక పోవడంతో కూలీలు పలు ఇబ్బందులకు గురవుతున్నారని స్పందించి వెంటనే పనులు కల్పించాలని కోరారు.

శ్మశాన వాటిక స్థలం ఆక్రమించారు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సర్వాయిపల్లె గ్రామస్థులు

ఉయ్యాలవాడ : గ్రామంలో ముస్లింలు, నూర్‌బాషాలు మృతి చెందితే పూడ్చుకునేందుకు కూడా స్థలం లేకుండా ఆక్రమిస్తున్నారని తహసీల్దార్ సువర్ణాదేవిని సర్వాయిపల్లె గ్రామస్తులు మొరపెట్టుకున్నారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మండల పరిధిలోని సర్వాయిపల్లె గ్రామానికి చెందిన రవి, అబ్దుల్లా, దస్తగిరి, పాలిమేర దస్తగిరి, పెద్ద కుళాయప్ప, చిన్నకుళాయప్ప, కట్టుబడి దస్తగిరితో పాటు మరి కొందరు హాజరై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా అనుభవంలో ఉన్న శ్మశాన వాటికలో నూర్‌బాషలు ఎవ్వరైనా మృతి చెందితే ఖననం చేస్తున్నాం. అయితే వారం రోజుల క్రితం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు శ్మశాన వాటిక స్థలం తనదని బెదిరిస్తున్నారన్నారు. ఈ విషయంలో రెవెన్యూ అధికారులే స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. అలాగే మాయలూరు గ్రామానికి చెందిన నర్సయ్య తన పొలం 61 సెంట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన తలారి రామానాయుడు తనకు ముగ్గురు పిల్లలు ఉన్న తల్లికి వందనం డబ్బులు జమ కాలేదని వినతిపత్రాలు అందజేశారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి బాధితులకు న్యాయం చేస్తామని తహసీల్దార్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఎంఈఓ 1 రఘురామిరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ ఏఈలు ఫణీత్‌క్రిష్ణ, వెంకటయ్య, వివిద శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కార్మికులు సమ్మెబాట



నంద్యాల మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె చేస్తున్న కార్మికులు

నంద్యాల(న్యూటౌన్): గత సమ్మె కాలంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలంటూ మున్సిపల్ ఇంజినీరింగ్ అవుట్ సోర్సింగ్ కార్మికుల ఆందోళనలు ఊపందుకున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా ఎలాంటి ప్రయోజనం జరగలేదని ఈనెల 13 నుంచి నిరాహారదీక్షలు చేపట్టారు. ముందుగా అన్ని మున్సిపాలిటీల అధికారులు, స్థానిక శాసన సభ్యులకు సమ్మె నోటీసులు అందజేశారు. ఇందులో భాగంగా సోమవారం నంద్యాలలో చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎక్స్‌గ్రేషియా ఏడు లక్షలకు పెంపు, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.75,000, దహన సంస్కారాల ఖర్చులు 20,000, రిటైర్‌మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లు అమలు చేసే వరకు ఆందోళన కార్యక్రమాలు కొనసాగిస్తామని మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు హెచ్చరించారు.

అన్నప్రసాదానికి రూ.లక్ష విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తు న్న అన్నప్రసాద వితరణకు సోమవారం విశాఖపటాన్నికి చెందిన సూర్యదేవర సాంబశివరావు రూ.1,00,116 విరాళాన్ని పర్యవేక్షకురాలు పి.దేవికకి అందజేశారు. దాతకు దేవస్థానం తరపున స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూప్రసాదాలను, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

సాక్షి గణపతికి విశేషపూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై సోమవారం సాయంత్రం సాక్షిగణపతికి అభిషేకం, విశేషపూజలు నిర్వహించారు. సాక్షి గణపతికి పంచామృతాలతోను, ఫలోదకాలతోను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోధకం, శుద్ధజలంతో అభిషేకం చేసి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు.

అంతర్రాష్ట్ర బైకు దొంగల అరెస్టు





వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ బాబు ప్రసాద్, దొంగల నుంచి పోలీసులు రికవరీ చేసిన బైకులు

- 24 ద్విచక్ర వాహనాలు రికవరీ

కర్నూలు: వివిధ చోట్ల బైకులను చోరీ చేసి తప్పించుకు తిరుగుతున్న ముగ్గురు అంతర్‌రాష్ట్ర దొంగలను మూడో పట్టణ పోలీసులు అరెస్టు చేసి కటకటాలకు పంపారు. ఈ ఏడాది మే 22వ తేదీన కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో ఓ ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూన్ 18న మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టగా దొంగల చిట్టా బయటపడింది. సీసీ ఫుటేజీ, సాంకేతిక ఆధారంగా నిందితులు అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం బురుజుపల్లి గ్రామానికి షేక్ బాబా ఫకృద్దీన్, పెద్దమండెం మండలం గుడిసెల చెరువు గ్రామానికి చెందిన షేక్ దాదా పీరా, కడప పట్టణానికి చెందిన చౌడగండ్ల అనీస్ అని తేలింది. వీరిని కర్నూలులోని నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని ఓ టైల్స్ ఫ్యాక్టరీ వెనకాల ఉన్న కంప చెట్ల వద్ద అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 24 బైకులను రికవరీ చేసి కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్ ఎదుట హాజరుపర్చారు. సీఐలు శేషయ్య, నాగశేఖర్, ఎస్‌ఐ చంద్ర తదితరులతో విలేకరుల సమావేశం నిర్వహించి డీఎస్పీ బాబు ప్రసాద్ వివరాలను వెల్లడించారు. షేక్ బాబా ఫకృద్దీన్, షేక్ దాదా పీరా, అనీస్ తదితరులు కలసి జట్టుగా ఏర్పడి బైకులు చోరీ చేసి కర్నూలులో దాచిపెట్టి నంద్యాల పట్టణానికి చెందిన సుభాన్, షాపీరాల ద్వారా విక్రయించి సొమ్ము చేసుకునేవారు. ఎలక్ట్రానిక్ పరికరాలతో నకిలీ ఆర్‌సీ (డూప్లికేట్)లను తయారు చేసి వాటిని ఒరిజినల్‌గా చూపి గ్రామీణ ప్రాంతాల్లో విక్రయించేవారు. నంద్యాలకు చెందిన సుభాష్, షాపీరాలు ప్రస్తుతం పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వరలో అరెస్టు చేయనున్నట్లు డీఎస్పీ వెల్లడించారు.